# సాంకేతికతతోనే గ్రామాభివృద్ధి

– ఏసీటీ గ్రూప్ సీఈఓ బాలా మల్లాడి

సాక్షి, బెంగళూరు : గ్రామీణులు సాంకేతిక పరిజ్ఞానం పొందినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రముఖ బ్రాండ్ బ్యాండ్ ప్రొవైడర్ కంపెనీ ఏసీటీ గ్రూప్ సీఈఓ బాలా మల్లాడి అభిప్రాయపడ్డారు. గ్రామీణులు సాంకేతిక పరిజ్ఞానం పొందడానికి బ్రాండ్ బ్యాండ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్రాండ్ బ్యాండ్ వినియోగంపై బెంగళూరులో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం వల్లే చాలా వరకూ పట్టణ, నగర వాసులు అభివృద్ధి సాధించారన్నారు. పాశ్చాత్య దేశాల్లో దాదాపు 70 శాతం మంది బ్రాండ్‌బ్యాండ్‌ను వినియోగిస్తుంటే మనదేశంలో అది 15 శాతం కూడా లేదన్నారు. మన దేశంలో గ్రామీణ జనాభా ఎక్కువని, అందువల్ల గ్రామాల్లో బ్రాండ్‌బ్యాండ్ వినియోగం ఎక్కువైనప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని అన్నారు. అందుకు అవసరమైన మౌలికసదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అంతేకాకుండా బ్రాండ్‌బ్యాండ్ పరిశ్రమను ప్రోత్సహించడం వల్ల స్థానికంగా చాలా మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు.